
# ప్రయాణం

- శాంతా సూరప్ప.



21-2, నేతాజి వీధి
నర్సన్నపేట - 532 421
శ్రీకాకుళం- జిల్లా.

ఏదో స్టేషన్ వచ్చినట్టుంది... ట్రెయిన్ స్లో అయింది. రిస్ట్‌వాచ్‌లో టైం చూశాను. అర్ధరాత్రి దాటుతోంది. ట్రెయిన్ ఆగింది.ఎదురుబర్త్ మీద వ్యక్తి లేచి బయటకెళ్తున్నాడు. ఫస్ట్ క్లాస్ కూపేలోంచి తొంగి చూశాను. పరిచయం ఉన్న ప్రదేశంలా అనిపించి పరిశీలించి చూశాను.

'శ్రీకాకుళం రోడ్...'

అమ్మావాళ్ళుండేది ఇక్కడికి దగ్గర్లోనే... మూడేళ్ళవుతోంది. అందర్నీ వదిలి వచ్చేసి. పై బర్త్‌లో ఆయన నిద్రలో ఉన్నారు. ఆయనకు మద్రాసు నుండి కలకత్తా బదిలీ కావటంతో ఈ ప్రయాణం తప్పని సరైంది.

ట్రెయిన్ బయలుదేరింది.

ఎదురు బెర్త్ వ్యక్తి జాడలేకపోవటంతో దిగిపోయాడేమో అనుకుని అతడి బెర్త్‌కేసి చూశాను. కాదన్నట్టు సగం త్రాగి వదలిన విస్కీగ్లాసు, ప్రక్కనే బాటిల్ కన్పించాయి. ఈ రాత్రంతా దానితోనే గడుపుతాడేమో.. అతడు రావడంతో నా బర్త్‌లో సర్దుకున్నాను.

ఎంత ప్రయత్నించినా నిద్రరాలేదు.కారణం అమ్మావాళ్ళు గుర్తొచ్చి కాదు.. ఎదురు బెర్త్ వ్యక్తి ఒకప్పుడు ఎంతో దగ్గరయిన శౌర్య... గతం పదే పదే కళ్ళముందు కదులుతోంది.

ఏడేళ్ళ క్రితం ఇంటర్ చదువుతున్న రోజుల్లో...

ప్రక్క ఫ్లాట్‌లోనికి ఎవరో వచ్చారని తెలిసి ఎవరైనా బయటకొస్తే చూద్దామని కాలేజీ నుండి వచ్చి కిటికీ దగ్గరే కూర్చున్నాను.

ఎంత సేటికీ ఎవరూ కన్పించక పోవటంతో అటుగా వచ్చిన పదవ తరగతి చదువుతున్న పెద్ద చెల్లిని అడిగాను. తను కూడా ఎవరినీ చూడలేదని చెప్పి ట్యూషన్‌కి వెళ్ళిపోయింది.

సరిగ్గా గంట తర్వాత నా ప్రయత్నం ఫలించింది. ఓ అబ్బాయి బయట నుండి వస్తూ ఆ ఇంటిలోనికి వెళ్ళాడు. తర్వాత ఇంకెవరూ కన్పించలేదు.

ఆ రాత్రి భోజనాల దగ్గర అమ్మ నాన్నతో చెప్పగా తెలిసింది... ఆ అబ్బాయి కాక ఇంకో ఇద్దరు బయట ఎక్కడో చదువుతున్నారని, ఆ అబ్బాయి ఇంటర్ పాసై డిగ్రీలో జాయిన్ కాబోతున్నాడని...

తర్వాత కొద్ది రోజుల్లోనే మా రెండిళ్ళకీ పరిచయం అయింది..

ఒక సాయంత్రం..

మా రెండు కుటుంబాలు సినిమా ప్రోగ్రాం వేసుకున్నారు. తర్వాత రోజు నాకు క్లాస్‌లో టెస్ట్ ఉండటంతో నేరావటానికి కుదరదని చెప్తే ప్రక్కింటి అబ్బాయిని ఇటువేపు కాస్త చూడమని చెప్పి వెళ్ళింది అమ్మ. అప్పుడు నాకు తెలిసింది. ఆ అబ్బాయి కూడా సినిమాకి వెళ్ళబోవటం లేదని. ఎందుకో తెలియదు కాని నాకొద్దిగా సంతోషం అన్పించింది.

తర్వాత టెస్ట్ కోసం ప్రిపేర్ అవుతూ ఆ విషయం మరచిపోయాను. సరిగ్గా ఎనిమిదవుతుండగా చదవాల్సింది ఇంకేం లేదనిపించి లేచి అలసిపోయినట్లయి వెళ్ళి ముఖం కడుక్కుని ఫ్రెష్‌గా ఫీలయ్యాను. తర్వాత టీ చేసుకుని తాగాలన్పించి అంతలోనే ఆ అబ్బాయికూడా కావాలేమోననుకుని వాళ్ళ ఫ్లాట్ వేపు వెళ్ళాను.

తన రూంలో కూర్చుని ప్రాబ్లమ్స్ చేసుకుంటున్నట్లున్నాడు. అలికిడికి వెనుతిరిగి చూసి మర్యాద కోసం అన్నట్టు చేస్తోన్న పనినాపి లేవబోతుంటే వారిస్తూ టీ త్రాగుతారేమో అడుగుదామని... నే వెళ్ళిన పని చెప్పాను.

'అబ్బె... వద్దండి...' మొహమాటంగా అన్నాడు.

అదే నేను మొదటి సారి వాళ్ళింటికి వెళ్ళటం. ఇద్దరికీ అదే మొదటి పరిచయం కావటంతో బిడియంగా చుట్టూ చూస్తూ ఉండిపోయాను, ఆ అబ్బాయేమైనా మాట్లాడతాడేమోనని ఎదురుచూస్తూ

'కూర్చోండి'

నే నిలబడే ఉండటంతో కుర్చీ చూపించాడు. అప్పుడు మళ్ళీ నే వెళ్ళిన పని జ్ఞాపకం వచ్చింది.

'ఇంత వరకూ చదువుతూ ఉండిపోవటంతో తలనొప్పిగా అన్పించింది. టీ త్రాగుదాం అనుకున్నాను. మీకూ కావాలంటే ఇద్దరికీ కలిపే చేద్దామనీ...' గబగబా చెప్పి ఆగాను.

'భోజనం టైం అయిందిగా.. ఇంక ఇప్పుడేం త్రాగుతాం...? ' అన్నాడు.

'భోజనం చేస్తారా అయితే...'

వెళ్ళిపోటానికి అన్నట్టు చూసిన నన్ను వారిస్తున్నట్టుగా అన్నాడు..

'ఇప్పుడే కాదు... అమ్మ వచ్చాక పెడుతుంది...'

పెట్టుకోటానికేమైనా ఇబ్బంది పడుతున్నాడేమో అనుకుని అడిగాను..

'కావాలంటే నే పెడతాను..'

'అదేం కాదు... అప్పుడే ఆకలి లేదు..' చెప్పాడు.

'అయితే టీ త్రాగండి...' అప్పటికి కొద్దిగా పరిచయం ఏర్పడినట్టుగా అన్పించి చనువుగా అన్నాను.

ఏమనుకున్నాడో ఏమో...

'కూర్చోండి త్రాగుదాం..'

చెప్పి కిచెన్‌లోనికి వెళ్ళబోయాడు.

'ప్రపోజ్ చేసింది నేను... నేచేసి తెస్తానుండండి...' అని అడ్డుపడ్డాను.

'మళ్ళీ చెయ్యటం ఎందుకు... అమ్మచేసి ఫ్లాస్క్‌లో పోసి ఉంచింది. అదే తెస్తాను..' చెప్పి వెళ్ళి రెండు కప్పుల్లో తీసుకొచ్చాడు.

ఆరోజు అలా అయిన పరిచయం మా మధ్య స్నేహాన్ని కుదిర్చింది. ఇద్దరి సబ్జెక్ట్‌లూ ఒకటే కావటంతో అప్పుడప్పుడు డౌట్స్ కోసం తన దగ్గరకెళ్ళి కూర్చునే దాన్ని. ఆ చనువునీ, స్నేహాన్నీ అడ్డుచెప్పలేదు మా పెద్దవాళ్ళు.

అంతా ఆడ పిల్లలం అవ్వటం వల్ల నాకు, ఒక్కడే అయిపోవటంవల్ల తనకి మరో కంపెనీ లేక ఒకరికి ఒకరం మంచి స్నేహితులమయ్యాం. రానురానూ మా మధ్య క్లోజ్‌నెస్ పెరుగుతూ వచ్చింది.

శౌర్య డిగ్రీ అయ్యాక తన ఇంట్రెస్ట్‌తో జర్నలిజంలో చేరాడు. ఆ రెండేళ్ళ యూనివర్సిటీ జీవితం అతనికో చేదు అనుభవాన్నిచ్చింది.

అతడి క్లాసుమేట్ ఓ అమ్మాయి స్నేహమని చెప్పి రెండేళ్ళు వెంట తిరిగి చివరికి గందరగోళం సృష్టించింది.


మామూలు బలహీనతలకు సడలని అతడి కాన్సన్‌ట్రేషన్‌ని ఓ అనుభవంతో డైవర్ట్‌చెయ్య ప్రయత్నించి విఫలమైంది. ఆ ఓటమిని ఒప్పుకోలేక పలువురిలో అతడి మగతనాన్ని పరిహసించింది. ఆ అపప్రధతో అతడు డిప్రస్ అవ్వటం చూసి ఇంకేం ట్రిక్స్ ప్లే చెయ్యకుండా పి.జిలో అతడికి రావలసిన మెరిట్ తనుకొట్టేసింది. ఊహించని పరిణామం.. అతడు సెన్సిటివ్‌గా తయారయ్యాడు.

యూనివర్సిటీలో ఆ అమ్మాయి సంఘటన తర్వాత అతను నా కంపెనీలో కూడా లోన్లీగా ఫీలయ్యేవాడు. అది నన్ను చాలా బాధపెట్టేది. ఉండబట్టలేక ఒకరోజు అడిగాను. అప్పటికి మాది ఐదేళ్ళ పరిచయం. నేను డిగ్రీ కూడా పూర్తిచేశాను.

'శౌర్యా... నా గురించి నీ అభిప్రాయం...?'

'అంటే...' భృకుటి ముడిచాడు.

'నీకిష్టం లేని స్నేహాన్ని కోరి నిన్ను ఇబ్బంది పెడ్తున్నాను...?'



'అలా ఎందుకనుకుంటున్నావ్..?' అర్థం కానట్టు చూశాడు.

నేనేం మాట్లాడలేదు.

చాలాసేపు ఇద్దరి మధ్యా మౌనం చోటుచేసుకుంది.

నా అంతరంగాన్ని చదివి మాట్లాడవలసింది తనే అని అర్థం చేసుకున్నట్టున్నాడు. మాట్లాడవలసిన సమయం వచ్చిందన్నట్టు.

'నాలో నా మెదడులాంటి స్థానం నీది. అదెప్పుడూ నిన్ను గూర్చే ఆలోచిస్తుంటుంది...'

నా గూర్చి తన అభిప్రాయాన్ని అంత గొప్పగా చెప్తాడని నేను హించలేదు. అసలు ముందు నాకు అతడు చెప్పింది అర్థంకాలేదు.. అర్థమయ్యాక..

ఒక్కమాట...

నాలో నాకు తెలియని నా మనసుని చదివి నన్ను నాకు అర్థమయ్యేట్లు చేశాడు శౌర్య.

ఆ ఒక్కమాటలో శౌర్య నన్నెంతలా వశపరచుకున్నాడంటే, అతడి కోసం ఏమైనా చేసెయ్యాలని ఆ క్షణమే నిర్ణయించుకున్నాను.

'కాని, అలాంటి నువ్వు కూడా రేపు ఇంకొక్కరి స్వంతం. అప్పుడు ఇప్పటిలా ఈ అనుభూతులేమీ ఉండవు. నువ్వు నన్ను జ్ఞాపకం పెట్టుకోవచ్చు. కాని, నీ పిల్లలు, సంసారం నన్ను డామినేట్ చేస్తాయి. అప్పుడు మళ్ళీ నేను ఒంటర్నే...'

అతడి ఈ మాటతో మళ్ళీ నాకు అతడు అర్థం కాలేదు.

'నా మనసుని నాకు అర్థమయ్యేలా చేసినవాడు తన మనసుని అర్థం కానీకుండా దాచేస్తున్నాడెందుకని?'

నిరాశావాదమా... బేలతనమా...? తను నాకు తగిననుకుంటున్నాడా...?

ఓ నిర్ణయానికొచ్చాను... ఇంట్లో చెప్పాను.

పెద్ద శబ్దం కావటంతో గతంలోంచి బయటకొచ్చాను.

రైలు వంశధార వంతెన మీదుగా వెళ్తోంది.

వంతెన చూసి జ్ఞాపకం వచ్చింది. చివరిగా నేను, శౌర్య విడిపోయింది విజయనగరం రైల్వే బ్రిడ్జి క్రింద. తను రిక్షాదిగి నన్ను ముందుకు పంపేశాడు.

శౌర్య విషయం ఇంట్లో చెప్పాక అందరి పెద్దవాళ్ళలానే మావాళ్ళూ ప్రవర్తించారు. మా రెండిళ్ళ మధ్య స్నేహం చెడింది. అమ్మ నన్ను ఊర్లో ఉంచకుండా విజయనగరం పిన్ని దగ్గరకు పంపించింది.

శౌర్యను రమ్మని రాశాను. అప్పుడు శౌర్య తనతో వచ్చేయమన్నాడు. ఎందుకో ఇంట్లో చెప్పక ముందు ఉన్నంత ధైర్యం తర్వాత లేకపోయింది. అది నాన్న పాయిజన్ సీసా చూపించి భయపెట్టటం వల్లనేమో... ఆ విషయం శౌర్యతో చెప్పి మరోసారి ఇంట్లో అడిగి ప్రయత్నిస్తానని, తననీ వాళ్ళింట్లో ఒప్పించమని చెప్పాను.

అలికిడికి ఆలోచనలోంచి అటు చూశాను. బాటిల్‌లోంచి విస్కీ గ్లాసులో పోసుకుంటున్నాడు శౌర్య.

నాకేసి చూడకపోవటంతో అతడి వేపు పరీక్షగా చూశాను. ఇప్పుడేమిటి... ఉదయం మద్రాసు సెంట్రల్‌లో అతడొచ్చి ఎదురుగా కూర్చున్నప్పటి నుండీ అవకాశం దొరికినప్పుడల్లా తను చూడకుండా చూసి తనని తదేకంగా చూస్తూనే ఉన్నాను. తను నన్ను గుర్తుపట్టాడో లేదో మరి... తనదైన బాణీలో ఎప్పటిలా మూడీగానే ఉన్నాడు.

అప్పటికంటే మనిషి బాగా లావెక్కాడు. అది వృత్తిపరమైన సంతృప్తి తెచ్చి ఉండవచ్చు... లేదా మద్యం ఇచ్చిన సంతృప్తితో కావొచ్చు.. తనదైన మార్క్‌లో సగం మాసిన గడ్డం.

ఇంట్లో తన విషయం చెప్పాక ఆ గడ్డమే కదా మొదటి అడ్డమయింది. చిన్న చెల్లి 'అతనెప్పుడూ గడ్డంతో ఉంటాడు.' అంటూ అమ్మకో నెగటివ్ అభిప్రాయాన్ని కలుగజేసింది.

నిజానికి అమ్మకి ఆ గడ్డం అభ్యంతరం కాదు. గొడవచెయ్యటానికి ఒక ఆధారం... తెలిసి పిడివాదం చేస్తున్న వాళ్ళతో తలపడి వాదించలేక, వాళ్ళ ముందు శౌర్య మంచితనాన్ని ప్రజెంట్ చెయ్యలేక కళ్ళని కన్నీళ్ళతోనూ, గుండెను గతంతోనూ తడుపుతూ మౌనంగా ఉండిపోయాను.

వాళ్ళు వెతికితెచ్చిన వ్యక్తినే వెనకేసుకొస్తే ఓర్వలేని వాళ్ళు నేను వెతుక్కున్నతన్నే వెనకేసుకొస్తే ఎన్నెన్ని వెతలు సృష్టిస్తారో వేరే చెప్పాలా...?

'ప్రేమించడానికి ఆ గడ్డం మాసినవాడు తప్పితే ఇంకెవరూ దొరకలేదే నీకు... ఎలా పోషిస్తాడే... నీ నగ్నదేహాన్ని వర్ణించి రాసి నిన్ను బజారులో దిగంబరంగా నిలబెట్టి అమ్ముకుంటాడా...?'

జర్నలిస్టయిన శౌర్యను గూర్చి అమ్మ నిజంగా మాట్లాడిన మాటలకు అది పరాకాష్ఠ.

అప్పటి వరకూ కొద్దిగా మెత్తబడి ఉన్న శౌర్య తల్లిదండ్రులు ఈ మాటతెలిసి పూర్తిగా బిగుసుకుపోయారు.

శౌర్య బాత్‌రూం వేపు వెళ్తూండటంతో ఆలోచనలోంచి బయటకొచ్చి టైం చూశాను. రెండవుతోంది. కంపార్ట్‌మెంట్‌లోని కూపేలన్నింటి తలుపులూ మూసి ఉన్నాయి. శౌర్యతో మాట్లాడదామని అలికిడి చెయ్యకుండా కంపార్ట్‌మెంట్ చివరికంటా వెళ్ళి నిల్చున్నాను.

కాసేపటికి తను బయటకొచ్చి ముందుకెళ్ళబోతుంటే 'శౌర్యా..' అని పిలిచాను.

ఆగి నాకేసి చూశాడు శౌర్య. అతడి మొహంలో ఏ భావం లేదు.

'బావున్నారా....?' నవ్వటానికి ప్రయత్నించాను.

ఎన్నాళ్ళ తర్వాతనో అతడితో మాట్లాడ గల్గుతున్నాననే ఉద్వేగం నా మొహంలో తను గమనించే ఉంటాడు. నావేపు ఓసారి చూసి ఊరుకున్నాడు.

'శౌర్యా ఏం చేస్తున్నారిప్పుడు...?' అడిగాను.

సమాధానం లేదు.

'పెళ్ళి...'

ఆపై అడగదలచుకున్న ప్రశ్న గొంతులోనే దాటేశాను.

నావేపు అదోలా చూసి నవ్వి వెళ్ళిపోయాడు.

నాకు చాలా బాధనిపించింది. అతడేమైనా మాట్లాడి ఉండి ఉంటే బావుండేది. కనీసం తననెందుకంత మోసం చేశావని నిలదీసి అసహ్యించుకున్నా అంత బాధ కలిగేదికాదేమో...

ఇంట్లో నాకు వేరే సంబంధం కుదర్చబోతున్నారని తెలిసి, నావైపు నుండి నేనలా బయట పడ్డాక తనవైపు నుండి ఏదైనా చేద్దామని నాపై నమ్మకంతో స్నేహితులను వెంటేసుకుని ఇంటికొచ్చి సంబంధం మాట్లాడబోయి ఇంట్లో వాళ్ళ ప్రవర్తనకు కలతపడి నన్ను వచ్చేయమని పిల్చినప్పుడు తనెవరో తెలియనట్టు మౌనం వహించి ఇంట్లో వాళ్ళ తిట్లు శాపనార్థాలకు ఆపై స్నేహితుల పరిహాసాలకు అతడిని వదిలేసి ఆ సీన్ నుండి తప్పుకున్న నేను అతడి నుండి ఇంత కంటే గొప్ప రెస్పాన్స్ ఆశించటం అత్యాశే...

తిరిగి వెళ్ళి నా బెర్త్‌లో సర్దుకున్నాను...

ఆ రాత్రంతా అతడు తాగుతుండటం తెలుస్తూనే ఉంది...

క్రొత్తగా ఆ త్రాగుడు తప్పితే శౌర్య స్వభావంలో అప్పటికీ ఇప్పటికీ మార్పేమీ వచ్చినట్టులేదు.

"సున్నితత్వాన్ని మనలో ఒక ప్రమాణంగా ఉంచుకోవచ్చునేమో గాని, దాని ప్రభావంలో చిక్కుకోవటం అభ్యాసం చేస్తే చివరికది ప్రమాదంగా పరిణమిస్తుంది. నలుగురిలో ఉన్నా మనసుకు ఒంటరితనాన్ని అలవరచి మనుషుల నుండి దూరంచేస్తుంది. మనసుకు దగ్గరగా వచ్చిన వాళ్ళ సాన్నిహిత్యాన్ని పొందలేనప్పుడు మనసుకు నచ్చని వాళ్ళ సాంగత్యాన్ని ఎంజాయ్ చెయ్యగలగాలి'.

ఏదైనా అతడితో వాదించి ఒప్పించటానికి ఇద్దరి మధ్య అంత సమయం, సన్నిహిత ఇప్పుడు లేదు.

నాలుగవుతుండగా శౌర్య మళ్ళీలేచి కూపే డోర్ తియ్యబోయి తూలాడు.

చప్పున వెళ్ళి సహాయం చేశాను. నిలదొక్కు కున్నాక నన్ను వదిలించుకుని బయటకు నడవ బోయాడు.

మళ్ళీ ఎక్కడైనా తూలి పడతాడేమోనని వదలకుండా తోడు వెళ్ళాను. కంట్రోల్ తప్పా డేమో...ఇష్టం లేకపోయినా నా ఆసరా తీసుకోవటం అతడికి తప్పలేదు. అతడి చుట్టూ చెయ్యివేసి నడిపిస్తుంటే అతడి ఆ స్థితికి కళ్ళల్లో నీళ్ళొచ్చాయి.

శౌర్య బాత్‌రూంకి వెళ్ళాక అక్కడే కంపార్ట్‌మెంట్ చివర ఆలోచిస్తూ నిలుచున్నాను...

జీవితాంతం తోడుగా ఉండి నడిపించటానికి అతడు ఎంచుకున్న గైడ్ అతడిని అతడి దారిలోనే వదిలేసి మరో యాత్రికుణ్ణి చూసుకుంది అనుకుంటే స్వార్థంలా అన్పించింది.

అప్పటిలో అంత మెచ్యూరిటీ లేక స్వతంత్రత లేక ఓ రకమైన అభద్రతా భావంతో తల్లిదండ్రులకు తలవంచింది నిజమయినా ఇప్పుడు పెడదారి పట్టిన అతణ్ణి రహదారికి మళ్ళించటం కర్తవ్యంగా భావించి అనువైన దారికోసం వెతికాను.

దారిని సూచిస్తున్నట్టుగా ఆయన కన్పించారు కూపే డోర్ తెరుస్తూ...

నిద్ర మధ్యలో లేచి బెర్త్‌పై నేను కన్పించక పోవటంతో వెతక బయలుదేరినట్టున్నారు. ఆయన నన్ను చూసి నావేపు రాబోతున్నప్పుడే శౌర్యకూడా లావెట్రిలోంచి వచ్చాడు.

ఏ బెరుకూ లేకుండా ముందులానే శౌర్యచుట్టూ చెయ్యివేసి పట్టుకుని ముందుకునడిపించాను.

దగ్గరగా వచ్చిన ఆయిన ప్రశ్నార్థకంగా చూశారు.

'శౌర్య...' చెప్పాను.

'నువ్వు చెప్పే ఆ శౌర్యేనా...' అడిగారాయన.

అవునన్నట్టు తలూపాను.

మావేపు చిత్రంగా చూస్తోన్న శౌర్యను ఆయన నా చేతుల్లోంచి తీసుకుని తెచ్చి బెర్త్‌పై పడుకోబెట్టారు.

'ఉదయం నుండి చెప్పలేదేం...?' నా ప్రక్కన కూర్చుంటూ అడిగారు.

నేను మాట్లాడ లేదు.

నిద్రపోతున్న శౌర్యను కాసేపుచూసి నేనేదో అడగబోవటం చూసి గమనించి అడిగారు...

'ఏమిటీ...?'

'శౌర్యను మనింటికి ఆహ్వానిద్దాం...' ఆయనవేపే చూస్తూ అన్నాను.

'దానికేనా... నిద్రలేచాక అతణ్ణి పరిచయం చేసుకుంటాను... పడుకో..' లేచి తన బెర్త్‌పైకి ఎక్కి పడుకున్నారాయన.

అర్థం చేసుకునే ఆయన దొరికితే ఆడపిల్లకు తలితండ్రుల దగ్గర కంటే భర్త దగ్గరే ఎక్కువ స్వతంత్రం ఉంటుందని రుజువుచేసి మరోసారి నా అభిమానాన్ని మరింత ప్రోదిచేసుకున్నారాయన.

బెర్త్‌పై వాలాను. మనసు తేలిక పడిందేమో... తెలియకుండానే నిద్రపట్టేసింది...

ఆయన తట్టిలేపటంతో మెలకువ వచ్చింది. హౌరా స్టేషన్‌లో ఆగివుంది ట్రెయిన్. శౌర్య కోసం చూశాను.

ఆయన నాచేతిలో ఓ స్లిప్ పెట్టారు...

తెరచి చదివాను...

'నేస్తం...


మళ్ళీ ఇన్నాళ్ళకు ఎదురై, అనుభవాలు నేర్పే పాఠాలకు భయపడి అధ్యయనం చెయ్యకుండా వదిలేస్తే జీవితం భవిష్యత్తు నుండి పలాయనం చిత్తగిస్తుందనే విషయం తట్టి చెప్పావు. నువ్వు నన్నేదో మోసం చేశావని అంతా నావేపునుండి ఆలోచించు కున్నానేగాని, నన్ను గూర్చి ఇంట్లో చెప్పటమే కాకుండా రిస్క్ తీసుకుని ఇదివరకే మీ ఆయనకు చెప్పి ఉండటం చదివితే మనిషిగా నువ్వు నన్నెంత అభిమానిస్తున్నదీ అర్థమయింది. అనుకున్నామని జరగవు అన్నీ, అనుకోలేదని ఆగవుకొన్ని... అనుకుంటే నాలోని వేదన తొలగించుకుందుకు వేదిక దొరికినట్ట యింది. ఇక ఈ విస్కీ వదిలెయ్యటం ద్వారా నాలోని పలాయన వాదాన్ని వదిలేస్తున్నాను... చివరిగా చిన్న విషయం... మీ భార్యాభర్తల మధ్య అండర్‌స్టాండింగ్ చూశాక నాకు పెళ్ళిచేసుకోవాలన్పిస్తుంది... మీ ఆయనే నాకు ఆదర్శం...

సెలవు...

ఆయనకూ నాకూ మధ్య జరిగిన సంభాషణ తను మగతలో విన్నాడని అర్థమవ్వడానికి నాకెక్కువ సేపు పట్టలేదు. తను మళ్ళీ కన్పించకుండాపోయినా తనలోని మార్పు ఆనందాన్నిచ్చింది.

రైలు దిగుతూ అనుకున్నాను...

'జీవితం రైలు ప్రయాణం లాంటిది. మనుషుల్ని ఎంతో దగ్గరగా కలిపి విడదీస్తూ మళ్ళీ ఎక్కడో కలుపుతూ ఉంది...' ★




కె.శ్రీనివాసులు, ఇ.నం.20-375 వెంకన్న వీధి, ఆదోని - 518 301.